క్లుప్తంగా

ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గడ్డం నవీన్

చండూరు: ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన గడ్డం నవీన్ ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) కౌన్సిల్ సమావేశంలో నవీన్‌ను ఎన్నుకున్నారు.

డీపీఆర్‌ఓకు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సంఘం నాయకులు

నల్లగొండ: నల్లగొండ డీపీఆర్‌ఓగా పని చేసి మహబూబ్‌నగర్‌కు బదిలీ అయిన శ్రీనివాస్‌ను సోమవారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు రాజ్‌కుమార్, ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా నిర్మలాదేవి

చండూరు : చండూరు డిప్యూటీ తహసీల్దార్‌గా నిర్మలాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ మాడ్గులపల్లి ఎలక్షన్ డీటీగా బదిలీపై వెళ్లారు. వేములపల్లిలో పనిచేస్తున్న నిర్మలాదేవి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయండి

మర్రిగూడ: ఈ నెల 13న సికింద్రాబాద్ మిలీనియం గార్డెన్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు జిల్లా తిరుమలేష్, గ్యార శ్రీనివాస్ కోరారు. సోమవారం వారు స్థానికంగా మాట్లాడుతూ ఈ సమావేశంలో జిల్లా, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పూరి గుడిసె దగ్ధం

కట్టంగూర్ : విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు పర్వతం సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు లేచి కమ్మలకు అంటుకుని గుడిసె దగ్ధమైందని తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.20 వేల నగదు, ఇంట్లోని సామగ్రి మంటల్లో కాలి బూడిదయ్యాయి.


సీఎంను కలిసిన నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు

నకిరేకల్ : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం సాయంత్రం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కలిశారు. మూసీ ప్రక్షాళన సుందరీకరణ కోసం బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించడం పట్ల సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ బడ్జెట్ నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య, మునుగోడు, భువనగిరి, తుంగతుర్తి ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, మందుల సామెల్ తదితరులు ఉన్నారు.

మార్కండేయ స్వామి ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో మార్కండేయ స్వామి ఆలయ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రణవ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు అవ్వారి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం గాయత్రీ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. 16న కల్యాణం, 17న రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గుంటోజు శ్రీనివాస్‌కు డాక్టరేట్

నల్లగొండటౌన్ : శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానానికి సాంకేతికత జోడించి శ్రీజెన్ సంస్థ ద్వారా ప్రజల ఆరోగ్య పరిక్షణ కోసం స్వచ్ఛమైన నీటిని అందించినందుకు సంస్థ ఫౌండర్ గుంటోజు శ్రీనివాస్‌కు డాక్టరేట్ లభించింది. సోమవారం గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి శ్రీనివాస్ డాక్టరేట్ అందుకున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు



ఉప్పలపహాడ్‌లో చెత్తకుండిలా మారిన నీటితొట్టి



కొప్పోలులో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

- నిర్వహణ మరిచిన పంచాయతీ సిబ్బంది
- నీరు లేక అల్లాడుతున్న మూగజీవాలు
- అందుబాటులోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు

కేతేపల్లి: గ్రామ పంచాయతీల నిర్వహణ లోపం, అధికారుల అలసత్వం కారణంగా వేసవిలో పశువుల దాహార్తిని తీర్చే లక్ష్యంతో గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. వాటి నిర్వహణను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన నీటితొట్లు అలంకారప్రాయంగా మారాయి. దీంతో దాహార్తిని తీర్చుకునేందుకు మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. తొట్లు ఖాళీగా దర్శనమిస్తుండడంతో పశుపోషకులు చేతి పంపులు, వ్యవసాయ బావుల వద్దకు పశువులను తీసుకెళ్లి దాహం తీర్చేందుకు అవస్థలు పడుతున్నారు.

ఒక్కో నీటి తొట్టికి రూ.17 వేల నుంచి రూ.20 వేల వరకు..

కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలతోపాటు ఐదు శివారులో గ్రామాల పరిధిలో ఎడ్లు, ఆవులు, 2720, గేదెలు 10,001, గొర్రెలు 67,281, మేకలు 59,84 ఉన్నాయి. మండలంలో 80శాతం మంది ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆయా గ్రామాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చే లక్ష్యంతో 2009 నుంచి 2017 వరకు ఉపాధిహామీ, వాటర్‌షెడ్ పథకాల కింద సుమారు 70 వరకు నీటితొట్లు నిర్మించారు. ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి రూ.17వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. గ్రామం నుంచి ఉదయం మేతకు వెళ్లేటప్పుడు, తిరిగి ఇంటికి చేరేటప్పుడు పశువులు నీటిని తాగేందుకు వీలుగా గ్రామ శివార్లలో వ్యవసాయ భూముల వద్దకు వెళ్లే డొంకబాటల వద్ద వీటిని నిర్మించారు.

పలు చోట్ల శిథిలమైన నీటి తొట్లు

నీటితొట్లు పశువులకు కొన్నాళ్లు బాగానే ఉపయోగపడినా తర్వాత నిర్వహణ లోపంతో మరమ్మతులకు గురయ్యాయి. వీటి నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలు నిర్వహించాల్సి ఉంది. చాలాచోట్ల పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు నీటితో తొట్లు నింపాల్సి ఉండగా అలాంటి చర్యలేమీ చేపట్టడం లేదు. దాదాపు సగం తొట్ల వద్ద నీటి వసతి లేదు. ఉన్నచోట బోరు మోటార్లు కాలిపోయి, నల్లా పైపులైన్‌లు పగిలిపోయాయి. ఇలాంటి సమస్యల కారణంగా పశువుల నీటితొట్లు పనికిరాకుండా పోతున్నాయి. ఏళ్ల తరబడి నిర్వహణ లేకపోవడంతో పలుచోట్ల శిథిలమైపోగా, మరికొన్ని పిచ్చి మొక్కలు, చెత్త, చెదారంతో దర్శనమిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులతో గ్రామాల్లో చెరువులు, కుంటలు నీరు లేక ఎండిపోయాయి. ప్రస్తుతం ఎండలు ప్రారంభం కావడంతో మేతకు వెళ్లి వచ్చే పశువులు నీరులేక అలమటిస్తున్నాయి. మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు బోరు, వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

నీటి సౌకర్యం కల్పించాలి



గ్రామంలో సుమారు 200 కుటుంబాలకు పైగా మూగజీవాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. వేసవి ప్రారంభం కావడంతో ఎండలు ఎక్కువ అవుతున్నాయి. పదేళ్ల కిత్రం నిర్మించిన నీటితొట్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. తొట్ల వద్ద నీటి సౌకర్యం కల్పించి అందుబాటులోకి తీసుకువస్తే మూగజీవాల దాహార్తి తీరుతుంది.

– జటంగి వెంకన్న, రైతు, కేతేపల్లి

పంచాయతీ అధికారులదే బాధ్యత



నీటితొట్లు నిర్మించేందుకు మాత్రమే ఈజీఎస్ పథకం కింద నిధులు మంజూరు అవుతాయి. వాటి మరమ్మతుల నిర్వహణ పంచాయతీ అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గాలు చూసుకోవాలి. అవసరమున్న చోట కొత్తగా నీటితొట్ల నిర్మాణాలకు ఈజీఎస్ నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం.

– సురేందర్, ఏపీఓ, కేతేపల్లి

కృష్ణా జలాల సాధనలో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



మునుగోడు : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

మునుగోడు: రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాల వాటాను సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల సాధన కోసం ఈ నెల 13న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభకు భారీగా తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నందికాటి శ్రీధర్, ఎంపీపీ కర్నాటి స్వామి, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

చలో నల్లగొండను విజయవంతం చేయాలి

చిట్యాల: కృష్ణా ప్రాజెక్టు నీటి హక్కు కోసం మంగళవారం నల్లగొండలో నిర్వహించనున్న చలో నల్లగొండ సభకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ చిట్యాల మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధానకార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నీటి హక్కు కోసం జరుగుతున్న ఈ సభలో రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయండి

మర్రిగూడ: నల్లగొండలో మంగళవారం నిర్వహించనున్న కేసీఆర్ భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ కోరారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



కట్టంగూర్ : బొల్లేపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య కోరారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని భారత ఆహార సంస్థ గోదాం డిపో మేనేజర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను అప్పగిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు పల్లె నగేష్, శ్రీనివాస్, సుంకరబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

కట్టంగూర్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని జీపీ కార్మికుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొండ అంజయ్య, ఐఎఫ్‌టీయూ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నాగేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ చలపతికి జీపీ కార్మికులు సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. అదేవిధంగా బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బొల్లేపల్లి గ్రామంలో పోస్టర్‌లను ఆవిష్కరించారు. జీపీ కార్మికులు పున్నంరాజు వెంకన్న, వెంకటయ్య, లింగయ్య, కత్తుల రామలింగయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు జంజరాల క్రాంతికుమార్, మహేష్, గణేశ్, రామకృష్ణ, నాగయ్య, యాదయ్య, వినోద్, వెంకన్న, నాగరాజు, శేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

నకిరేకల్ : ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలె సత్యనారాయణ కోరారు. నకిరేకల్‌లో సోమవారం జరిగిన మధ్యాహ్న భోజన పథకం యూనియన్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కందికంటి వసంత, కార్యదర్శిగా వంటెపాక సైదమ్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు వంటెపాక వెంకటేశ్వర్లు, సంఘ ప్రతినిధులు నరసమ్మ, మంగమ్మ, వెంకటమ్మ, అంతమ్మ, గౌరమ్మ, లక్ష్మమ్మ, బుచ్చమ్మ, ఈరమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మునుగోడు: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు చాపల శ్రీను కోరారు. సమ్మె పోస్టర్‌ను సోమవారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బెల్లం శివయ్య, దుబ్బ వెంకన్న, ఈద యాదయ్య, దొమ్మాటి గిరి, బొల్లు సైదులు, శ్రీశైలం, మద్ది అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం'

నల్లగొండ టూటౌన్: ఉద్యోగాలు భర్తీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందని, ఉద్యోగాల కల్పనలో మోదీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం విమర్శించారు. సోమవారం నల్లగొండలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓలమాల ఆంజనేయులు, నవీన్, షరీఫ్, మల్లేష్, కొండల్, శంకర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ వార్డెన్ రాములుకు నివాళి

మునుగోడు: మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన రిటైర్డ్ వార్డెన్ నకరకంటి రాములు గౌడ్ (65) అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఆ గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు వివిధ పార్టీల, సంఘాల నాయకులు హాజరై రాములు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, జన సమితి పార్టీ రాష్ట్ర నాయకుడు పల్లె వినయ్ కుమార్, వీరమళ్ల నర్సింహగౌడ్, తిరిపారి వెంకన్న, తాటికొండ సైదులు, ఈదులకంటి కైలాస్‌గౌడ్, అంజయ్య, పాలకూరి యాదయ్య గౌడ్, అనంత ఆంజనేయులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తతోనే ప్రమాదాల నివారణ



ప్రమాదాలు జరిగే స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

నల్లగొండక్రైం: ముందు జాగ్రత్త చర్యలతోనే రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని నల్లగొండ రూరల్ సీఐ కొండల్‌రెడ్డి అన్నారు. సోమవారం మర్రిగూడ బైపాస్‌లో రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని ఎస్‌ఐ శివకుమార్‌తో కలిసి పరిశీలించారు. బైపాస్ వద్ద ప్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో వస్తే రాకపోకల కారణంగా ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, స్టాపర్స్, రేడియం స్టిక్కర్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మర్రి శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమకూర్చిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కోనేటి యాదగిరి అందజేశారు.

నేటి నుంచి విజయభారతి సయాని పర్యటన

నల్లగొండ : జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సయాని మంగళవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ హరిచందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ హక్కులకు సంబంధించి ఎవరైనా దరఖాస్తులను జాతీయ కమిషన్ సభ్యురాలికి అందజేయాలనుకుంటే ముందుగా లైజన్ అధికారి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ (ఫోన్ నంబర్ 7780696154)ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కేసీఆర్ నిర్లక్ష్యంతోనే సాగునీటి కష్టాలు



తిప్పర్తిలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కిసాన్ సెల్ నాయకులు

రామగిరి(నల్లగొండ): కేసీఆర్ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కృష్ణా, గోదావరి జలాల విషయంలో తీవ్ర అన్యాయం జరిగి తాగునీటి కష్టాలు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ తిప్పర్తి మండల అధ్యక్షుడు పల్లపు వెంకన్న అన్నారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలో కిసాన్ సెల్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో గత ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి పాశం నరేష్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండలో బహిరంగ సభ పేరుతో కేసీఆర్ డ్రామాలు ఆడుతున్నాడని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 90 శాతం పూర్తయిన ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కనీసం నిధులు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు పూర్తి చేస్తే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పేరు వస్తుందని ప్రతిపక్ష నాయకులు అసూయపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లోడంగి వెంకటేశ్వర్లు, సందీప్, నాగరాజు, బైరగోని జానయ్య, ప్రవీణ్, ప్రసాద్, నూకల మహేష్, వాడల వెంకన్న, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై ఎంఈఓ ఆగ్రహం



పాఠాలు బోధిస్తున్న ఎంఈఓ అరుంధతి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని జొన్నలగడ్డగూడెం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నాగభూషణచారి, ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ పనిచేస్తున్నారు. లక్ష్మీనారాయణ సెలవులో ఉన్నారు. విధులకు రావాల్సిన నాగభూషణచారి పాఠశాలకు సమయానికి రాలేదు. ఎంఈఓ అరుంధతి సోమవారం ఉదయం పాఠశాలను తనిఖీ చేయగా పాఠశాలలో విద్యార్థులు మాత్రమే ఉన్నారు. దీంతో ఎంఈఓ స్వయంగా విద్యార్థులతో ప్రార్థన చేయించారు. అనంతరం పాఠాలను బోధించారు. సదరు ప్రధానోపాధ్యాయుడు ఆలస్యంగా రావడంతో ఎంఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని సూచించారు. ఉపాధ్యాయుల తీరుతో విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ



నల్లగొండ టూటౌన్: పతకాలతో విద్యార్థులు

నల్లగొండటూటౌన్: పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన 9వ షాటోకాన్ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్‌లో అన్‌స్టాపబుల్ కరాటే, జిమ్నాస్టిక్స్ అకాడమి విద్యార్థులు ప్రతిభ చూపి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. లక్ష్మీతేజస్వి, లిఖిత, పవిత్ర, హైపాలు స్వర్ణ పతకాలు సాధించారు. ఆద్య, తనిష్క, జితిజ్ఞ, రోహిత్ లు రజత పతకాలను సాధించారు. కుంగ్‌ఫూ విభాగంలో శ్రీఅన్వి, లక్ష్మీప్రసన్న, అనుజ్ఞ, ఆస్త్రియాలు స్వర్ణ పతకం సాధించారు. అనన్య, కార్తికేయ, శ్రేణాలు కుంగ్‌ఫూలో రజత పతకాలు సాధించారని అకాడమి డైరెక్టర్ పల్ల పవన్ తెలిపారు.

నాంపల్లి విద్యార్థుల ప్రతిభ

నాంపల్లి: నల్లగొండలో ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో నాంపల్లికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 11మంది విద్యార్థులు కరాటే కోచ్ షేక్ టిప్పుసుల్తాన్ ఆధ్వర్యంలో పాల్గొనగా అందులో నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి బహుమతి పి పవన్, బెల్లి శివరాకృష్ణ, ద్వితీయ బహుమతి కె.శివ,సాయికృష్ణ సాధించారు. విద్యార్థులను స్థానిక ఎస్‌ఐ లచ్చిరెడ్డి అభినందించారు.

పల్లె ప్రకృతి వనంలో 30వేల మొక్కలు దగ్ధం



కాలిపోయిన మొక్కలను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఖాసీం

కనగల్ : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పల్లెప్రకృతి వనంలో మొక్కలు దగ్ధమయ్యాయి. కనగల్ మండలం జి.యెడవెల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జి.యెడవెల్లి గ్రామంలోని చండూరు రోడ్డు వెంట 10ఎకరాల స్థలంలో బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి సుమారుగా రూ.10లక్షల ఉపాధిహామీ నిధులతో భారీగా మొక్కలు నాటారు. మధ్యాహ్న సమయంలో దుండగులు వనంలోకి ప్రవేశించి గడ్డివేసి నిప్పంటించడంతో సుమారు 30వేల మొక్కలు కాలిపోయాయని పంచాయతీ కార్యదర్శి ఖాసీం తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో వనాన్ని పరిశీలించగా మొక్కలన్నీ దగ్ధమైనట్లు పేర్కొన్నారు. గతంలో కూడా నిప్పు వేసి తగలబెట్టడంతో 6వేల మొక్కలు కాలిపోయాయన్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చామని, మంగళవారం ఉన్నతాధికారులను సంప్రదించి, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

చెరువు కబ్జాకు గురికాకుండా కాపాడాలి

కనగల్: అమ్మగూడెం చెరువును కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని బీఎస్పీ మండల కన్వీనర్ కొండ నరేందర్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. చెరువు నీటి ఆధారంగా అమ్మగూడెం, కుమ్మరిగూడెం గ్రామాల ప్రజలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఫుల్ ట్యాంక్ లెవెల్‌కు మించి చెరువు చుట్టూ కొందరు అక్రమంగా మట్టిని నింపుతున్నారని అన్నారు. చెరువు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని అధికారులను కోరారు. ఆయన వెంట మాచర్ల శ్రీను, కొండ శ్రవణ్, అమ్మగూడెం గ్రామ వార్డు సభ్యుడు మండలి పరమేష్, మాచర్ల రాజు తదితరులు ఉన్నారు.

తాటికల్ పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వరరావు



చైర్మన్ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు

నకిరేకల్ : మండలంలోని తాటికల్ పీఏసీఎస్ చైర్మన్‌గా నాగులంచ వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2020 ఫిబ్రవరి నెలలో ఈ సంఘానికి ఎన్నికలు నిర్వహించిన విషయం విదితమే. బీఆర్‌ఎస్‌కు చెందిన పల్‌రెడ్డి మహిందర్ రెడ్డి చైర్మన్‌గా నాలుగేళ్లు పనిచేశారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న వైస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఖాళీగా ఉన్న ఒక డైరెక్టర్ పదవికి ఈ నెల 3వ తేదీన ఎన్నిక నిర్వహించడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి ఎన్నికయ్యారు. మొత్తం 13 మంది డైరెక్టర్లుగాను కాంగ్రెస్‌కు తొమ్మిది, బీఆర్‌ఎస్‌కు నలుగురు డైరెక్టర్లు ఉన్నారు. సంఘం చైర్మన్‌పై కాంగ్రెస్ డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధవుతున్న నేపథ్యంలో ముందుగానే చైర్మన్ పల్‌రెడ్డి మహిందర్‌రెడ్డి తన పదవికి ఈ నెల 8వ తేదీన రాజీనామా చేశారు. మహిందర్‌రెడ్డి రాజీనామాను ఆమోదించిన జిల్లా కోపరేటివ్ అధికారి కిరణ్‌కుమార్.. వైస్ చైర్మన్‌గా ఉన్న నాగులంచ వెంకటేశ్వరరావును తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాలని ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నాగులంచ వెంకటేశ్వరరావు తాత్కాలిక చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటేశ్వరావును సంఘం పాలక వర్గంతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు నకిరేకంటి నరేందర్, బొప్పని సరోజ, భుజంగరావు, జిల్లా నర్సయ్య, మేడి లింగయ్య, సామ సత్తిరెడ్డి, కొల్లు నాగిరెడ్డి, చేతరాజు సైదులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల పరిధిలోని వెల్మకన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయుడు అ ద్దంకి దేవదాస్, మాజీ సర్పంచ్ చలమల్ల వెంకట రెడ్డి, ఎంపీటీసీ చాపల మారయ్య, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ బి.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధ్యానంతోనే మానసిక ఒత్తిడి దూరం



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: ప్రతిరోజు యోగా, ధ్యానం చేయడం వల్ల మానసిక ఒత్తిడి దూరమై పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారని ఎస్ఆర్ విద్యా సంస్థల నల్లగొండ జోనల్ ఇన్‌చార్జ్ దోనాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ బ్రాంచ్‌లో విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యా సంస్థలో వారానికి ఒకసారి యోగా, ధ్యానం చేయిస్తామని, విద్యార్థులు ఇంటి వద్ద కూడా ప్రతిరోజు ధ్యానం చేయాలన్నారు. దీనివల్ల మానసికంగా ధృడంగా అవుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్, ఏఓ సరితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు

మర్రిగూడ: స్థానిక ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్లు సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీఓ యూసుఫ్, సూపరింటెండెంట్ యాకూబ్, ఏపీఓ గుంటుక వెంకటేశం, పంచాయతీ కార్యదర్శులు మాలతి, షాకీర్‌అలీ, రాకేష్, లక్ష్మీ, మౌనిక, శిరీష, పద్మ, అఖిల, ఉమాదేవి, పార్వతీ, గీత, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

నాంపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో సోమవారం అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ చాత్రవాస్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14వరకు జిల్లాలోని అన్ని షెడ్యూల్ కులాల వసతి గృహాలను సందర్శించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గ్యార గోపాల్, పోగుల వెంకట్ రెడ్డి, చిరుమావిళ్ళ గిరిబాబు, సింగారపు గిరి, నాంపల్లి సతీష్, లక్ష్మయ్య, శ్రీనివాస్, పంగా అశ్వర్ తదితరులు పాల్గొన్నారు.